PRGI No: TGBIL/25/A0946

విశాలజ్యోతి

సమగ్ర తెలుగు దినపత్రిక

DK MEDIA
approved by Govt of INDIA, TELANGANA
OUR SERVICES
* NEWS PAPER * NEWS CHANNEL * DK GRAPHICS
* DK ADS & PROMOTIONS * DK PRINTERS * DK PUBLICATIONS
WE'RE HIRING REPORTERS
for more details 9440711117, www.vishalajyothi.com

వరంగల్ సంపుటి : 02 సంచిక : 80 ఆదివారం, అక్టోబర్ 18 2026, పేజీలు - 4 వెల : 5 రూ/-

తెలంగాణలో భూసమగ్ర సర్వేపై మంత్రి పొంగులేటి సమీక్ష..

పలు కీలక ఆదేశాలు జారీ

హైదరాబాద్, అక్టోబర్ 17: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ సర్వేపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు భూ రీసర్వేలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సర్వేకు ముందు భూ యజమానులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు, గ్రామకంఠాల హద్దులపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 'రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర సర్వేను చేపట్టింది. మూడు దశల్లో ఈ భూసర్వే కొనసాగుతుంది. వచ్చే నెలాఖరులోగా తొలిదశ సర్వే పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. తొలి దశలో భాగంగా ఇప్పటికే 2,720 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి అయింది. సర్వేలో భాగంగా ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులు నిర్ణయిస్తున్నాం. అనంతరం ప్రతి సర్వేనెంబర్‌కు ప్రత్యేక భూదార్ ఐడీని కేటాయిస్తున్నాం. ఆధునిక సాంకేతికతతో భూముల కొలతలు తీసుకుని డిజిటల్ రూపంలో వివరాలను భద్రపర స్తున్నాం. ఈ వివరాలన్నింటినీ భూ భారతి పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం. ఈ మేరకు భూయజమా నులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తాం. పాలేరు నియోజకవర్గంలో త్వరలో భూదార్ పట్టాల పంపిణీ చేస్తాం. కాగా, నేలకొండపల్లి మండలం కొంగరలో 665 ఎకరాల్లో వందశాతం రీసర్వే పూర్తి అయింది' అని మంత్రి పేర్కొన్నారు.

నీరు, విద్యుత్ పొదుపుపై ప్రజల్లో
అవగాహన కల్పించండి

- నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు.
- హైదరాబాద్‌లో బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డులను ఆయన ప్రదానం చేశారు.
- నీరు, విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించండి



హైదరాబాద్, అక్టోబరు 17 : నీరు, విద్యుత్ పొదుపుపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా యువకళాకారులు పనిచేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శిల్పకళా వేదికలో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్' అవార్డుల ప్రదానోత్సవం కనులపండువగా సాగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీరు, విద్యుత్ ను పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు.ఎల్‌నినో ప్రభావంతో అక్టోబర్‌లోనే మునుపెన్నడూలేనంత విద్యుత్ డిమాండ్ పెరిగిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ మేరకు తెలుగు సినీ పరిశ్రమ ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్ ఫ్ల్యూయెన్సర్లు ముందుకొచ్చి నీరు, విద్యుత్ పొదుపుపై ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో శిల్పకళా వేదికలో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్' అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫిల్మ్ మేకర్స్ పోటీల్లో లఘు చిత్రాలు, ప్రభుత్వ పథకాలపై రూపొందించిన పాటల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు ప్రోత్సాహంతో పాటు మెమెంటోతో సత్కరించారు. సీఎం పిలుపు మేరకు స్పందించిన యువ కథానాయకుడు విజయ్ దేవరకొండకు భట్టివిక్రమార్క అభినందనలు తెలిపారు."అక్టోబర్, నవంబర్‌లోనే ఇలాంటి పరిస్థితి ఉంటే వేసవిలో ఎంత పీక్‌కు వెళుతుందో తెలియదు. చలికాలంలోనే ఎండాకాలం చూస్తున్నాం. 10 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నుంచి 20 వేల మెగావాట్లు దాటిపోయింది. ఇలాంటి పరిస్థితి రాష్ట్ర చరిత్రలో ఇంతకు ముందెన్నడూ తలెత్తలేదు. భవిష్యత్?లో ఇంకా ఎలా పెరుగుతుందో కూడా తెలియదు. అందువల్ల విద్యుత్, నీరును పొదుపుగా వాడుకోండి. ఉన్న నీటిని సంరక్షించేందుకు మార్గాలను చెప్పాలని యంగ్ ఫిల్మ్?మేకర్స్?ను కోరుతున్నాం

'బీజేపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు

అలవాటు పడింది

హైదరాబాద్ : హైదరాబాద్, అక్టోబర్ 17: బీజేపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు అలవాటు పడిందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. (శనివారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. బీజేపీ విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రతిసారీ విదేశీ శక్తులను తెరపైకి తెస్తోందని మండిపడ్డారు. చైనా భూ ఆక్రమణపై మాట్లాడే దమ్ము మోదీకి లేదన్నారు. రోహింగ్యాల పేరుతో దేశ ప్రజల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. దొరికితే దొంగ అన్నట్లుంది బీజేపీ తీరు అంటూ మండిపడ్డారు. ఈడీ దాడులు కేవలం ప్రతిపక్ష పార్టీ నేతలపైనే ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. ఎన్నిక పక్రియ నిబంధనలను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎందుకు మార్చారని, కమిటీలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌ను ఎందుకు తొలగించారని పీసీసీ చీఫ్ నిలదీశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా జ్ఞానేష్ కుమార్ ఎన్నికైన రోజే ప్రమాదాన్ని గురించి రాహుల్ గాంధీ హెచ్చరిం చారని గుర్తుచేశారు. 'మీరు ప్రజల మద్దతుతో గెలవలేరు.. అందుకే ఓటు దొంగతనానికి పాల్పడ్డారు' అంటూ బీజేపీపై విరుచుకుపడ్డారు. పెద్ద రాష్ట్రాలలో ఓట్ల దొంగతనం ఎక్కువగా జరుగుతోందని అన్నారు.గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో సీపీఎం మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నామని మహేశ్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో సీపీఎం కలసి పనిచేస్తోందని చెప్పారు. నేటి సీపీఎం పోలిట్‌బ్యూరో మీటింగ్ తర్వాత వారి నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటిస్తారన్నారు. ఇండియా కూటమిలోని అన్ని పార్టీల మద్దతు కూడగడతామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

హన్మకొండలో ఐటీ టవర్స్

హనుమకొండ: ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించడంతో పాటు మత్తుకు దూరంగా ఉండాలని పిలుపునిస్తూ హనుమకొండలో నిర్వహించిన మారథాన్‌లో ఓరుగల్లు ప్రజలు వేల సంఖ్యలో పాల్గొన్నారు. నాయిని విశాల్ ట్రస్ట్ చైర్మన్ మీూ నాయిని రాజేందర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ మారథాన్‌లో మంత్రి శ్రీధర్ బాబు, పలువురు మీూలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. యువతతో కలిసి రన్నింగ్‌లో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు.. బాలసముద్రంలో ఓ టీస్టాల్ వద్ద ఆగి సరదాగా గడిపారు. టీ తాగుతూ సెల్ఫీలు దిగి సందడి చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఓరుగల్లు ప్రజలకు శుభవార్త తెలిపారు. త్వరలో హనుమకొండలో ఐు టవర్స్ నిర్మిస్తామని ప్రకటించారు.హనుమకొండ హాఫ్ మారథాన్ రన్‌తో సందడిగా మారింది. హయగ్రీవచారి మైదానం నుండి 5 కి,మీ, 10 కి.మీ, 21 కి.మీ మారథాన్ రన్ నిర్వహించారు. వరంగల్ పశ్చిమ మీూ నాయిని రాజేందర్ రెడ్డి తన తనయుడు విశాల్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మారథాన్ లో వేలాదిమంది యువత, విద్యావంతులు, ఉద్యోగులు, వైద్యులు, క్రీడాకారులు, వికలాంగులు కూడా పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై

ఉక్కుపాదం

హైదరాబాద్, అక్టోబరు 17 : మాదక ద్రవ్యాల నిరోధానికి ఎన్నో చర్యలు తీసుకున్నామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. మాదక ద్రవ్యాలపై ఉక్కు పాదం మోపుతున్నామని పేర్కొన్నారు. 2029 డిసెంబర్ 31వ తేదీలోగా డ్రగ్స్ రహిత దేశంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. అందుకోసం ఎన్నో కార్య క్రమాలు, వ్యూహాలను మనం చూడ బోతు న్నామని తెలిపారు. డ్రగ్స్ హానికరమని.. ఇవి దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయని పేర్కొ న్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని యువ తకు డీజీపీ పిలుపునిచ్చారు. రాష్ట్రీయ ఏక్తా దివస్--2026 సందర్భంగా (శనివారం) ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో జాతీయ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణలో మాదకద్రవ్యాల నిర్మూలన, డ్రగ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీజీపీ సీవీ ఆనంద్ హాజరై, ప్రసంగించారు. ఆరు రోజుల క్రితం వివిధ రాష్ట్రాల్లో ఈ ర్యాలీ ప్రారంభమైందని వెల్లడించారు. ఈ ర్యాలీలో ఐదు రాష్ట్రాల వారు పాల్గొన్నారని అన్నారు.

78వ ఐపీఎస్ అధికారుల

పాసింగ్ అవుట్ పరేడ్.

హైదరాబాద్: హైదరాబాద్, అక్టోబర్ 17: నగరంలో 78వ ఐపీఎస్ అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్ ముగిసింది. పరేడ్‌కు పంజాబ్ క్యాడర్ ఐపీఎస్ ట్రైనీ అధికారి గౌరవ్ ఉప్పల్ నాయకత్వం వహించారు. 78వ బ్యాచ్ ఐపీఎస్ ట్రైనింగ్‌లో ఓవరాల్ టాపర్‌గా గౌరవ్ ఉప్పల్ నిలిచారు. ప్లాటూన్ వన్ కమాండర్‌గా తమిళనాడు కేడర్ ఐపీఎస్ ట్రైనీ శివ చంద్రన్ నాయకత్వం వహించారు. రెండో ప్లాటూన్ కమాండర్‌గా తమిళనాడు కేడర్ ట్రైనీ ఐపీఎస్ కవిన్ మోజీ, మూడో ప్లాటూన్ కమాండర్‌గా రాజస్థాన్ క్యాడర్ ట్రైనీ ఐపీఎస్ తేజస్వి దేశ్ పాండే నాయకత్వం వహించారు.నాలుగో ప్లాటూన్ కమాండర్‌గా రాయల్ భూటాన్ పోలీస్‌కు చెందిన లేక్ జిన్ పెల్డెన్ లామో, ప్లాటూన్ ఐదుకు గుజరాత్ క్యాడర్‌కు చెందిన ట్రైనీ ఐపీఎస్ కుహూ గార్గ్, ఆరో ప్లాటూన్‌కు ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ముకుంద సింగ్ నాయకత్వం వహించారు. మౌంటెడ్ ప్లాటూన్‌కు కేరళ క్యాడర్ ట్రైనీ ఐపీఎస్ రిషబ్ భట్ నాయకత్వం వహించారు. ట్రైనింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఐపీఎస్ ప్రొబేషనర్లకు కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. కప్పులు, ట్రోఫీలను ప్రదానం చేశారు. ఉత్తమ అవుట్‌డోర్ ప్రొబేషనర్‌గా కుహూ గార్గ్‌కు ఐపీఎస్ అసోసియేషన్ స్వోర్డ్ ఆఫ్ ఆనర్ కప్ అందజేశారు.అవుట్‌డోర్ సబ్జెక్టుల్లో ప్రావీణ్యతకు బీఎస్ఎఫ్ ట్రోఫీని లెక్జిన్ పెల్డెన్ లామో అందుకున్నారు. ఈక్విటేషన్‌లో ప్రతిభకు గాను రిషబ్ భట్‌కు టోంక్ కప్

దక్కింది. పోలీస్ సైన్సెస్‌లో ప్రతిభకు గాను శివచంద్రన్‌కు ఎన్ఎఫ్ఎస్‌యూ ట్రోఫీ, న్యాయశాస్త్రంలో ప్రతిభకు ఆరుషి శర్మకు మణిపూర్ కప్ ఫర్ లాను అందజేశారు. అంతేకాకుండా కంప్యూటర్ అధ్యయనాల్లో ప్రతిభ కనబరిచిన శివచంద్రన్‌కు ఎన్‌సీఆర్‌బీ ట్రోఫీ వరించింది. ఫేజ్ వన్‌లో ఉత్తమ విదేశీ ప్రొబేషనర్‌గా డైరెక్టర్ ట్రోఫీని లెక్జిన్ పెల్డెన్ లామో అందుకోగా.. ఫేజ్ వన్‌లో ఉత్తమ ప్రొబేషనర్‌గా గౌరవ్ ఉప్పల్‌కు.. డైరెక్టర్ ట్రోఫీని అందజేశారు.

నవరాత్రి వేడుకల్లో సినిమా పాటలకు డ్యాన్స్ చేస్తే కఠిన చర్యలు



నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రజలు సినిమా పాటలకు డ్యాన్సులు చేస్తే తక్షణ చర్యలు తీసుకోవాలని మద్రాస్? హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు తమిళనాడు పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సినిమా పాటలకు నృత్యాలు చేయడంపై మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన న్యాయస్థానం, ఉత్సవాల నిర్వహణకు పోలీసులు విధించిన నిబంధనలు ఉల్లంఘిం చినట్లు గుర్తిస్తే తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర చంద్రబాబు ప్లాన్‌కు

రేవంత్ సహకారం

హైదరాబాద్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తూ తెలంగాణ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎల్‌నినో పేరుతో ప్రభుత్వం చేతులెత్తేస్తోందని మండిపడ్డారు. అత్యంత కీలకమైన సాగునీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు.దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు అందుబాటులో ఉన్నప్పటికీ మూడు మాత్రమే నడిపిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. తాము అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని అన్నారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ కరవు పరిస్థితులు,



పంటల సాగుకు విరామం ప్రకటించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో తెలంగాణ నీటిని తరలించే ప్రతిపాదనలకు రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. గోదావరి-బనకచర్ల, గోదావరి-నల్లమల సాగర్ ప్రతిపాదనలు ముందుకు సాగలేదని, గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.

PRGI No: TGBIL/25/A0946
విశాలజ్యోతి
సమగ్ర తెలుగు దినపత్రిక

రాజ్‌నగర్ దుబ్బాలో మదర్సా వివాదం

బెదిరింపు కాల్స్ కలకలం

● నిర్మాణ అనుమతులపై గతంలో ఫిర్యాదు.. ఇప్పుడు ప్రాణహాని బెదిరింపులంటూ స్థానికుల ఆరోపణలు

● కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికుల విజ్ఞప్తి....

నందిపేట్, అక్టోబర్ 17: నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం రాజ్‌నగర్ దుబ్బాలో మదర్సా ఫైజల్ సలీమ్ ఫాతిమా నిర్వహణ, నిర్మాణానికి సంబంధించిన వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. నివాస గృహ నిర్మాణ అనుమతితో మదర్సా నిర్మాణం చేపడుతున్నారంటూ గతంలో అభ్యంతరాలు వ్యక్తం చేసిన స్థానికులు, తాజాగా తమకు బెదిరింపు ఫోన్‌కాల్స్ వస్తున్నాయని ఆరోపిస్తూ అధికారులను ఆశ్రయించారు. తమను, తమ పిల్లలను చంపేస్తామని బెదిరిస్తున్నారని పేర్కొంటూ ఈ నెల 13న సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. నిర్మాణ అనుమతుల నుంచి బెదిరింపు కాల్స్ వరకు తమ ఫిర్యాదుల్లోని అన్ని అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతున్నారు.

నిర్మాణ అనుమతులపై తొలి ఫిర్యాదు

రాజ్‌నగర్ దుబ్బాలో మదర్సా నిర్మాణంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ స్థానిక నివాసితులు ఈ నెల 12న అధికారులకు ఫిర్యాదు చేశారు. వ్యక్తిగత నివాస గృహ నిర్మాణానికి అనుమతి తీసుకుని, అందుకు భిన్నంగా మదర్సా నిర్మాణం చేపడుతున్నారని వారు ఆరోపించారు. నిర్మాణానికి అవసరమైన అనుమతులు, భూమి వినియోగానికి సంబంధించిన నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించాలని రెవెన్యూ, పంచాయతీ, పోలీసు అధికారులను కోరారు. చందాల సేకరణ వ్యవహారంపైనా నిబంధనల ప్రకారం విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. అదే రోజు మండల ప్రజావాణిలోనూ సంబంధిత అధికారికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

బెదిరింపు కాల్స్ వస్తున్నాయంటూ ఆరోపణలు

తాజాగా తమకు ఫోన్‌కాల్స్ ద్వారా బెదిరింపులు వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. తమతోపాటు అక్కడ చిన్నచిన్న పనులు చేసుకునే కార్మికులను సైతం ఫోన్ చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. మహారాష్ట్రతో పాటు విదేశాల నుంచి కూడా అంతర్జాతీయ ఫోన్‌కాల్స్ ద్వారా బెదిరింపులు వస్తున్నాయన్న ఆరోపణలపై దర్యాప్తు చేయాలని కోరారు. ఫోన్‌కాల్స్ వెనుక ఎవరున్నారు వాటి ద్వారా నిజంగానే బెదిరింపులు జరిగాయా జరిగితే వాటికి బాధ్యులెవరు అనే అంశాలను పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు.

ఐదేళ్ల క్రితం నుంచే వివాదం?

స్థానికులు తమ ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. సుమారు ఐదేళ్ల క్రితం హాశిముల్ ఖాద్రి అనే వ్యక్తి రాజ్‌నగర్ దుబ్బాలో ఇమామ్‌గా పనిచేసి, అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత తన భార్య పేరుతో వ్యక్తిగత స్థలాన్ని కొనుగోలు చేసి, అదే పేరుతో మదర్సా సొసైటీని ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. మదర్సా నిర్వహణ, చందాల సేకరణ

తదితర అంశాలపై తాము అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలిపారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల వివరణ, అధికారిక రికార్డుల పరిశీలన ద్వారా వాస్తవాలు తేలాల్సి ఉంది.

ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

ఈ నెల 13న ఎంపీడీవో, తహసీల్దార్, గ్రామ కార్యదర్శి, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు తెలిపారు. నిర్మాణ అనుమతులు, భూమి వినియోగం, మదర్సా నిర్వహణ, చందాల సేకరణతోపాటు తాజాగా వచ్చినట్లు చెబుతున్న బెదిరింపు కాల్స్‌పై సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నారు.

తమకు, తమ కుటుంబాలకు రక్షణ కల్పించాలని నందిపేట్ ఎస్ఐ, పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై సంబంధిత శాఖలు సమన్వయంతో విచారణ చేపట్టి, నిబంధనల ఉల్లంఘనలు లేదా నేరపూరిత బెదిరింపులు నిర్ధారణ అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాస్తవాలు తేలాల్సి ఉంది: రాజ్‌నగర్ దుబ్బాలో మదర్సా నిర్మాణం, నిర్వహణపై స్థానికులు చేసిన ఆరోపణలు, బెదిరింపు ఫోన్‌కాల్స్ వ్యవహారం ప్రస్తుతం విచారణ ద్వారా నిర్ధారించాల్సిన అంశాలుగా ఉన్నాయి. నిర్మాణానికి సంబంధించిన అనుమతుల పత్రాలు, భూమి రికార్డులు, సొసైటీ వివరాలు, ఫోన్‌కాల్స్‌కు సంబంధించిన సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తేనే వాస్తవాలు స్పష్టమవుతాయి. ఈ వ్యవహారంపై అధికారుల స్పందన, పోలీసుల దర్యాప్తు వివరాలు వెల్లడికావాల్సి ఉంది. సంబంధిత వ్యక్తుల వివరణ కూడా వెలుగులోకి రావాల్సి ఉంది.

రూ.51 లక్షల కరెన్సీ నోట్లతో

దుర్గామాత మండపం అలంకరణ

● ఆర్మూర్‌లో కనువిందు చేసిన అమ్మవారి త్రిశూలం..

● ప్రత్యేక అలంకరణను తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు

ఆర్మూర్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పట్టణంలోని కోటార్మూర్ రెవెన్యూ ప్రాంతంలో దుర్గామాత మండపం ప్రత్యేక ఆకంణగా నిలిచింది. దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా ఇండియన్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి మండపాన్ని రూ. 51 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

స్థానిక భక్తుల సహకారంతో శుక్రవారం రాత్రి రూ. 500 నోట్లను ఉపయోగించి మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ముఖ్యంగా అమ్మవారి త్రిశూలం ఆకృతిలో రూపొందించిన కరెన్సీ నోట్ల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వినూత్నంగా అలంకరించిన మండపాన్ని వీక్షించేందుకు శనివారం ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆర్మూర్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అలంకరణను తిలకించారు. కోటార్మూర్ రెవెన్యూ ప్రాంత ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాల తో, అష్టైశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ

ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఇండియన్ బాయ్స్ యూత్ దుర్గాదేవి ఉత్సవ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలతో వేడుకలను కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బాయ్స్ యూత్ ప్రతినిధులతో పాటు మాజీ కౌన్సిలర్ ప్రొద్దుటూరి మురళీధర్ రెడ్డి (రాజు), పసుపుల చంద్రశేఖర్, రాస భూమేశ్వర్, రాస గంగా ప్రసాద్, గుండెం నాగరాజు (చిట్టి), పిట్టేల నాగేష్, గడ్డి రామకృష్ణ, పసుపుల కృష్ణ ప్రసాద్, రాజశేఖర్, నటరాజ్, మహిపాల్, నితిన్, శివతేజ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వడ్డీ వ్యాపారులపై నిజామాబాద్

పోలీసుల మెరుపు దాడులు

● 67 ప్రాంతాల్లో తనిఖీలు.. 42 చోట్ల కీలక పత్రాలు, నగదు స్వాధీనం

● అప్పుల పేరుతో వేధిస్తే కఠిన చర్యలు తప్పవు: సీపీ సాయి చైతన్య హెచ్చరిక

నిజామాబాద్, అక్టోబర్ 17: ప్రజల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలు వసూలు చేస్తూ, అప్పులు తీసుకున్న వారిని వేధిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ వడ్డీ వ్యాపారులపై పోలీసులు శనివారం మెరుపు దాడులు నిర్వహించారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ పోలీస్ డివిజన్ల పరిధిలో మొత్తం 67 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టగా.. 42 ప్రాంతాల్లో చెక్కులు, ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు, నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు పోలీస్ శాఖ వెల్లడించింది.

మూడు డివిజన్లలో విస్తృత తనిఖీలు

కమిషనరేట్ పరిధిలో అక్రమ వడ్డీ వ్యాపారాలపై నిఘా పెంచిన పోలీసులు.. సంబంధిత వడ్డీ వ్యాపారుల ఇళ్లతో పాటు అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మొత్తం 67 ప్రాంతాల్లో సోదాలు చేపట్టగా, 42 ప్రాంతా ల్లో పలు కీలక పత్రాలు, నగదు లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వస్తువులు, పత్రాలను పరిశీలించి అక్రమ వడ్డీ వ్యాపారాలకు సంబంధించిన వివరాలను అధికారులు విశ్లేషిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు

పోలీస్ శాఖ తెలిపింది.

అప్పుల పేరుతో వేధిస్తే ఉపేక్షించేది లేదు

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య మాట్లాడుతూ.. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలు వసూలు చేయడం, అప్పులు తీసుకున్న వారిని బెదిరించడం, బలవంతంగా చెక్కులు, ఇతర పత్రాలు తీసుకోవడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టవిరుద్ధమైన వడ్డీ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ప్రత్యేక తనిఖీలు, దాడులను నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

బాధితులు భయపడొద్దు.. పోలీసులను ఆశ్రయించండి

అక్రమ వడ్డీ వ్యాపారుల వేధింపులకు గురవుతున్న బాధితులు భయపడకుండా ముందుకు వచ్చి సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీస్ శాఖ సూచించింది. అధిక వడ్డీల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తుల సమాచారం తెలిసినా పోలీసులకు తెలియజేయాలని కోరింది. బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు.

దసరా వేళ గొర్రె పొట్టేళ్లకు భారీ డిమాండ్

● మందల వద్దే కాదు.. అంగడి బజార్లలోనూ జోరుగా కొనుగోళ్లు

● నచ్చిన పొట్టేలు కోసం ముందస్తు బుకింగ్‌లు.. పాళ్ల పద్ధతిలో ఖర్చుల పంపకం

నిజామాబాద్--కామారెడ్డి: దసరా పండుగ నేపథ్యంలో ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో గొర్రె పొట్టేళ్లు, మేకపోతులకు డిమాండ్ పెరుగుతోంది. పండుగ వేళ నాణ్యమైన మాంసంతో విందు చేసుకోవాలనే ఉద్దేశంతో మాంసాహార ప్రియులు ముందుగానే కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెల మందల వద్దకు వెళ్లి నచ్చిన పొట్టేళ్లను ఎంపిక చేసుకుంటుండగా, ఉమ్మడి రెండు జిల్లాల్లోని అంగడి బజార్లలోనూ గొర్రెలు, మేకల కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయి. పండుగకు అవసరమైన జంతువులను ముందుగానే కొనుగోలు చేసేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు.

మందల వద్దే ఎంపిక.. అంగడి బజార్లలో బేరసారాలు

దసరా సమీపిస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెల కొనుగోళ్లు జోరందుకుంటున్నాయి. ముఖ్యంగా నలుగురైదుగురు కలిసి సుమారు 10 నుంచి 12 కిలోల మాంసం వచ్చే గొర్రె పొట్టేళ్ల కోసం అన్వేషిస్తున్నారు. తమ అవసరాలకు సరిపడా బరువున్న పొట్టేలు దొరికితే ధర ఖరారు చేసుకుని ముందస్తుగా బుకింగ్ చేసుకుంటున్నారు. మరోవైపు ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని వివిధ గ్రామాలు, పట్టణాల అంగడి బజార్లలోనూ గొర్రెలు, మేకల విక్రయాలు పండుగ సందడిని తలపిస్తున్నాయి. కొనుగోలుదారులు తమకు నచ్చిన జంతువును ఎంపిక చేసుకుంటూ వ్యాపారులతో ధరలపై బేరసారాలు సాగిస్తున్నారు.

కలిసి కొనుగోలు.. పాళ్ల పద్ధతిలో మాంసం పంపకం

మార్కెట్లో కిలో మటన్ ధరతో పోలిస్తే

సుమారు రూ. 200 అదనంగా చెల్లించాల్సి వచ్చినా, నాణ్యమైన మాంసం లభిస్తుందనే నమ్మకంతో పలువురు కలిసి గొర్రె పొట్టేళ్లు, మేకపోతులను కొనుగోలు చేస్తున్నారు. పండుగ రోజున వధించిన అనంతరం లభించిన మాంసాన్ని పాళ్ల పద్ధతిలో పంచుకుంటూ ఖర్చును సమంగా భరిస్తున్నారు. ఇలా చేయడం వల్ల తమకు నచ్చిన జంతువును ఎంపిక చేసుకోవడంతోపాటు, ఒక్కొక్కరిపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించుకోవచ్చని భావిస్తున్నారు.

పండుగ వేళ పెంపకందారులకు గిరాకీ

దసరా సందర్భంగా గొర్రెలు, మేకలకు డిమాండ్ పెరగడంతో పెంపకందారులు, వ్యాపారులు కొనుగోలుదారుల అవసరాలకు అనుగుణంగా ధరలు నిర్ణయిస్తున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే పండుగ సమయంలో ధరలు పెరుగుతున్నాయని కొనుగోలుదారులు చెబుతున్నారు. మందల వద్ద నచ్చిన



పొట్టేలు కోసం వెతుకులాట కొనసాగుతుండగా, అంగడి బజార్లలోనూ కొనుగోళ్లు పెరుగుతున్నాయి. పట్టణాల్లో నివసించే కొందరు సైతం దసరా కోసం సొంత గ్రామాలకు చేరుకుని స్నేహితులు, బంధువులతో కలిసి గొర్రెలను కొనుగోలు చేస్తున్నారు.

ఆయుధ పూజలతోనూ పెరుగుతున్న డిమాండ్

దసరా సందర్భంగా ఆయుధాలు, వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, వాహనాలకు పూజలు చేయడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో గొర్రెలు, మేకలను బలి ఇచ్చే సంప్రదాయం కూడా ఉండటంతో వాటికి గిరాకీ పెరుగుతోంది. పండుగ సమీపించే కొద్దీ అంగడి బజార్లతోపాటు గొర్రెల మందల వద్ద కూడా కొనుగోళ్లు మరింత పెరిగే అవకాశం ఉంది.

మొత్తంగా దసరా పండుగ ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో గొర్రెలు, మేకల వ్యాపారానికి ఊపునిస్తోంది.

నచ్చిన పొట్టేలును ముందుగానే సొంతం చేసుకోవా లనే ఆసక్తితో కొనుగోలుదారులు బుకింగ్‌లకు ప్రాధాన్యమిస్తుండగా, అంగడి బజార్లలోనూ పండుగ సందడి నెలకొంటోంది.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

● ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల 5వ రోజుసమ్మె లో డాక్టర్ టి భరత్ కుమార్ డిమాండ్.

వరంగల్ జిల్లా, విశాలజ్యోతి: నేషనల్ హెల్త్ మిషన్ శాశ్వత ఉద్యోగులతో సమానంగా నేషనల్ హెల్త్ మిషన్ లో 78 క్యాడర్ ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సమాన హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా పోచం మైదాన్ సర్కిల్ వద్ద ఎన్ హెచ్ ఎం లు నిరవదిక నాలుగో రోజుకు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13 నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్.హెచ్,ఎం నిరవదిక సమ్మె చేపట్టినట్లు తెలిపారు, గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగులకు దీటుగా పనిచేసినా ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. తెలంగాణలు రాష్ట్రవ్యాప్తంగా 17వేల మంది ఉద్యోగులము పనిచేస్తున్నామన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా రెగ్యులరైజ్ కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం హక్కులు కల్పిస్తూ ఆర్టికల్ 14,16,39 డి ప్రకారం సమాన పనికి సమాన హక్కులు, ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. నిత్యవసర ధరల పెరుగుదల వల్ల చాలీచాలని జీతంతో జీవనం కొనసాగిస్తున్నామన్నారు. మహిళ ఉద్యోగులకు 180 రోజులు జీతంతో కూడిన సెలవులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత , హెల్త్ కార్డ్స్ ,ఆరోగ్య బీమా ప్రతి ఉద్యోగికి కల్పించాలని జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టీ భరత్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి సానుకూల స్పందన వచ్చేంత వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, బి.ఆర్.ఎస్ పార్టీ హరి రమాదేవి మీకు అండగా ఉంటానని తెలియజేయడం జరిగింది. డాక్టర్ హరికృష్ణ ,డాక్టర్ రమ్య, డాక్టర్ గుండా రవీందర్ ,డాక్టర్. యశస్విని , డిస్టిక్ ఎర్లీ ఇన్ఫర్మేషన్ సెంటర్ మేనేజర్ మెరుగు అనిల్ కుమార్ , ఎన్ హెచ్ ఎం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆచంట అభిషేక్ ,నితిన్, సంజీవ్, నర్సింగ్ ఆఫీసర్స్ స్వప్న, మంజుల, వాణి, పబ్లిక్ హెల్త్ మేనేజర్ వైకుంఠం, జన్న కోర్నెలు, ల్యాబ్ టెక్నీషియన్ శోభ, ఏ.ఎన్.ఎం.లు చంద్రకళ, జ్యోతి,విజయ, సంధ్య , రాజేశ్వరి, ఎమ్.ఎన్.ఓ.లు , ఏకుల చిరంజీవి, సపోర్టింగ్ స్టాఫ్ ప్రవళిక , సాగర్ ,గూడెపు ప్రభాకర్ తోటి ఉద్యోగులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా

ఎరుకలి శ్రీనివాస్ నియామకం

చేవెళ్ల అక్టోబర్ 17 విశాల జ్యోతి న్యూస్
ప్రతినిధి శ్రీపాల్

చేవెళ్ల మండలం ఎనికేపల్లి గ్రామానికి చెందిన ఎరుకలి శ్రీనివాస్‌ను రంగారెడ్డి జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా నియమించారు. గత పది సంవత్సరాలుగా పార్టీ కార్యకర్తగా చురుగ్గా పనిచేస్తూ, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ తనదైన పాత్ర పోషిస్తున్న శ్రీనివాస్‌కు జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ, కార్యకర్తగా సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న

ఆయనకు జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం పట్ల ఆయన అనుచరులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నియామకంతో ఎనికేపల్లి గ్రామంతో పాటు చేవెళ్ల ప్రాంతంలో ఆయనకు పరిచయమున్న పార్టీ శ్రేణుల్లో ఆనందం నెలకొంది. ఈ సందర్భంగా ఎరుకలి శ్రీనివాస్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని.

నాయకత్వం ఆశ యాలకు అనుగుణంగా పనిచేస్తానని పేర్కొన్నారు. జిల్లాలో ఎస్టీ మోర్చాను మరింత బలో పేతం చేయడానికి కృషి చేస్తానని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూ, తనకు అప్పగించిన బాధ్యతలకు పూర్తి న్యాయం చేస్తానని ఎరుకలి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

PRGI No: TGBIL/25/A0946
విశాలజ్యోతి
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదివారం, అక్టోబర్ 18, 2026

నిజామాబాద్ కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల రగడ

- మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠాలపై ఉత్కంఠ.. ఎవరికి దక్కనున్న అవకాశం?
- దసరా గడువు దాటినా కొలిక్కిరాని నియామకాలు.. ఆశావహుల్లో పెరుగుతున్న ఆందోళన!
- నిజామాబాద్ జిల్లాలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల భర్తీపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ
- నిజామాబాద్, ఆర్మూర్ సహా పలు మార్కెట్ కమిటీల్లో కొత్త పాలకవర్గాల కోసం ఎదురుచూపులు
- నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ఎస్టీ రిజర్వేషన్.. తెరపైకి పలువురు ఆశావహులు కేతావత్ యాదగిరి, తారాచంద్ నాయక్, శాంగుభాయి, సుభాష్ జాదవ్ పేర్లపై చర్చ
- నగరమా.. గ్రామీణ ప్రాంతమా? పదవి ఎవరికి కేటాయిస్తారన్న దానిపై ఆసక్తి
- ఆర్మూర్ మార్కెట్ కమిటీ పీఠంపైనా పోటీ.. వచ్చే నెల 8తో ప్రస్తుత పాలకవర్గం గడువు ముగింపు
- కీలక నేతల మధ్య సమన్వయంపై ఉత్కంఠ.. నియామకాలపై అధిష్ఠానం నిర్ణయం కోసం ఎదురుచూపులు

నిజామాబాద్, అక్టోబర్ 17: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల భర్తీ కాంగ్రెస్ పార్టీలో రాజకీయ ఉత్కంఠకు తెరలేపుతోంది. పలు మార్కెట్ కమిటీల పాలకవర్గాల పదవీకాలాలు ముగిసినా, కొత్త నియామకాలపై స్పష్టత రాకపోవడంతో ఆశావహుల్లో నిరీక్షణ పెరుగుతోంది. కీలక నేతల మధ్య సమన్వయం, సామాజిక సమీకరణాలు, రిజర్వేషన్ల నేపథ్యంలో పదవుల కేటాయింపు కాంగ్రెస్ నాయకత్వానికి సవాలుగా మారినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోందిముగిసిన గడువులు.. కొత్త నియామకాలపై ఎదురుచూపులు

నిజామాబాద్, బోధన్, కమ్మర్‌పల్లి, వేల్పూర్, వర్ని మార్కెట్ కమిటీల పాలకవర్గాల పదవీ కాలాలు ఇప్పటికే ముగిశాయి. ఆర్మూర్ మార్కెట్ కమిటీ పదవీకాలం కూడా నవంబర్ 8తో ముగియనుంది. ఇటీవల బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నాగేశ్వర్‌రావు నియమితులైన నేపథ్యంలో మిగిలిన కమిటీలకు ఎవరిని ఎంపిక చేస్తారన్న అంశంపై ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ఎస్టీ రిజర్వేషన్ అమలులో ఉండటంతో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.

అగ్రనేతల నిర్ణయం కోసమే ఎదురుచూపులు

మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్ పదవుల కోసం ద్వితీయ శ్రేణి నాయకులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తదితర ముఖ్య నేతల సమన్వయంతో ఎంపిక ప్రక్రియ కొలిక్కి వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే పార్టీ కార్యక్రమాలు, నేతల బిజీ షెడ్యూల్, స్థానికంగా నెలకొన్న రాజకీయ సమీకరణాల కారణంగా తుది నిర్ణయంపై స్పష్టత రావడం లేదని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

నిజామాబాద్‌లో ఎస్టీ కోటా కోసం పోటీ

నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు కేతావత్ యాదగిరి, తారాచంద్ నాయక్, మాజీ కార్పొరేటర్ శాంగుభాయి, నగర ఎస్టీ సెల్ అధ్యక్షుడు సుభాష్ జాదవ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. పార్టీ కోసం కష్టకాలంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలన్న వాదనతో పాటు సామాజికవర్గాల ప్రాతినిధ్యం అంశం కూడా తెరపైకి వస్తోంది.ఎరుకల సామాజికవర్గానికి తగిన ప్రాధాన్యం కల్పించాలని సుభాష్ జాదవ్ కోరుతున్నట్లు సమాచారం. మరోవైపు, రూరల్ నియోజకవర్గానికి చైర్మన్ పదవి కేటాయిస్తే యాదగిరి లేదా శాంగుభాయ్ పేర్లకు అవకాశాలు ఉండవచ్చన్న చర్చ సాగుతోంది. నగరానికి ప్రాధాన్యం దక్కితే సుభాష్ జాదవ్ అభ్యర్థిత్వం పరిశీలనలోకి వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ పేర్లపై పార్టీ నాయకత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

ఆర్మూర్‌లోనూ మారుతున్న రాజకీయ సమీకరణాలు

ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కూడా ఎస్టీ రిజర్వేషన్ పరిధిలో ఉండటంతో అక్కడి కాంగ్రెస్ నాయకుల్లోనూ పోటీ నెలకొంది. ప్రస్తుత చైర్మన్ సాయిబాబా గౌడ్ మరోసారి అవకాశం ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో లంబాడా తదితర ఎస్టీ సామాజికవర్గాలకు చెందిన నాయకులు కూడా పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం. దీంతో ఆర్మూర్‌లో ఎవరికి అవకాశం దక్కుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

పదవీకాలం తగ్గుతున్న కొద్దీ పెరుగుతున్న ఒత్తిడి

ప్రభుత్వ పాలనలో ఇప్పటికే గణనీయమైన కాలం గడిచిపోవడం, మిగిలిన వ్యవధిలో పదవులు దక్కించుకోవాలన్న ఆశావహుల ఆతృతతో కాంగ్రెస్‌లో అంతర్గత పోటీ తీవ్రతరమవుతోంది. పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వడం, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయడం, నియోజకవర్గాల వారీగా ప్రాతినిధ్యం కల్పించడం వంటి అంశాలు ఎంపికలో కీలకం కానున్నాయి.మొత్తంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల భర్తీ కాంగ్రెస్

ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి,ఎన్నికల

అధికారులు రాజీనామా చేయాలి

- చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద కాంగ్రెస్ భారీ తిరంగా ర్యాలీ
- వి. హనుమంతరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మోతె రోహిత్ డిమాండ్

హైదరాబాద్, విశాలజ్యోతి: ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించడాన్ని నిరసిస్తూ కాంగ్రె స్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పత్తర్ ఘాట్ నుండి చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వరకు భారీ 'తిరంగా ర్యాలీ' నిర్వహించారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కొనసాగిన ఈ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలు చేతబూని "రాహుల్ గాంధీ నాయకత్వం వర్ధిల్లాలి", "ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలి" అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వి. హనుమంతరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మోతె రోహిత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు నాయకత్వంలో సుమారు నూట యాభై మందికి పైగా కార్యకర్తలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఓటర్ల తొలగింపునకు కారణమవుతున్న ప్రత్యేక తీవ్రమైన ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) విధానాన్ని వెంటనే రద్దు చేయాలని వి. హనుమంతరావు డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా వ్యవహరించడంలో విఫలమైన ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు బాధ్యులైన ఎన్నికల అధికారులందరూ వెంటనే రాజీనామా చేయాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా దిడ్డి రాంబాబు మాట్లాడుతూ..

దేశంలో ప్రజాస్వామ్యా న్ని, రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కాపాడేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఢిల్లీ వేదికగా సుదీర్ఘ పోరాటం చేసు న్నారని, ఆయన పోరాటానికి మద్దతుగా ఈ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. ఓటు చోరీని అరికట్టేంత వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగేది లేదని నాయకులు స్పష్టం చేశారు.

జవహర్ బాల్ మంచ్ జిల్లా చైర్మన్ కు సన్మానం

- మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అభినందన సభ

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, విశాలజ్యోతి : జవహర్ బాల్ మంచ్ కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా చైర్మన్‌గా నియమితులైన నైతం రాంచందర్‌ను శనివారం తిర్యాణి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొట్నాక గణపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నైతం రాంచందర్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ జిల్లా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నైతం రాంచందర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. బాలల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యత, సేవాభావాన్ని అలవర్చడంలో జవహర్ బాల్ మంచ్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.నూతన బాధ్యతల్లో నైతం రాంచందర్ మరిన్ని కార్యక్రమాలు చేపట్టి బాలల అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా నాయకులు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని నైతం రాంచందర్‌కు అభినందనలు తెలిపారు.

రైతులను కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలి

- ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు

హనుమకొండ, విశాలజ్యోతి: ఎల్ నినో ప్రభావం వలన నష్టపోతున్న రైతులను, కౌలు రైతులను, రైతు కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినారు. ఎల్ నినో ప్రభావం వలన సాగునీరు, విద్యుత్ అందించలేని పరిస్థితులు ఉన్నాయి కాబట్టి రైతులు రబి రెండవ పంట వేయవద్దని ప్రభుత్వమే విజ్ఞప్తి చేస్తున్న నేపథ్యంలో ఆర్థికంగా నష్టపోతున్న రైతులను, రైతు కూలీలను ఆదుకో

వడానికి ప్రభుత్వం వారికి ప్రత్యేక ఆర్థిక సహాయం చేయటానికి రైతులకు రైతు భరోసాతో పాటు ఒక్కొక్క రైతుకి ప్రభుత్వం 20వేల రూపాయల ఆర్థిక సహాయం చేయాలి. అలాగే రైతు కూలీలకి కౌలు రైతులకి ఉపాధి హామీ పనుల కల్పనతో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద గత మూడు బడ్జెట్లలో కేటాయించిన 1600 కోట్ల రూపాయలను విడుదల చేసి ఒక్కొక్క రైతు కూలీకి 12 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేసినారు. సాగునీరు లేక ఖరీఫ్ లో పంట ఎండిపోయిన రైతులు రబీ పంట వేయలేని రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు కాబట్టి పనులు లేక రైతు కూలీలు కూడా నష్టపోతున్నారు కాబట్టి ఆర్థికంగా వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేసినారు. ఎల్ నినో ప్రభావంతో ఉత్పత్తి తగ్గిపోవడంతో ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయే ప్రమాదం ఉంది కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ధరల పెరుగుదలను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని అభిప్రాయపడనారు. రైతులను రైతు కూలీలను కౌలుదారులను ఆదుకోటానికి ఎం.ఎల్.ఏలు ఎంఎల్‌సి లు, ఎం పి లు, కార్పొరేషన్ చైర్మన్ లు, ప్రభుత్వ సలహాదారులు నాలుగు నెలల పాటు ప్రభుత్వం నుండి జీతభత్యాలు తీసుకోకుండా వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేసినారు.

తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి

- రానున్న పది నెలల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు.. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి
- యాసంగిలో వరికి బదులు తక్కువ నీటి పంటలు సాగు చేయాలి.. ధాన్యం విక్రయాల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలి
- నీటి వృథాను అరికట్టాలి.. నిర్లక్ష్యం వహిస్తే అధికారులదే బాధ్యత: కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్, అక్టోబర్ 17: ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలమట్టాలు పడిపోతున్న నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రానున్న పది నెలల పాటు నగరాలు, మున్సిపల్ పట్టణాలు, గ్రామాల్లోని ప్రతి నివాస ప్రాంతానికి రక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మరోవైపు, యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండి తక్కువ నీరు అవసరమయ్యే పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సుదర్శన్ రెడ్డి వివిధ శాఖల అధికారులతో తాగునీటి సరఫరా, జలాశయాల్లో నీటి నిల్వలు, వ్యవసాయ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మున్ముందు తలెత్తే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

యాసంగిలో వరి సాగు వద్దు

ప్రస్తుత ఖరీఫ్ పంటలను ఎలాగోలా కాపాడుకున్నా, యాసంగిలో సాగునీరు అందించడం సవాలుగా మారే అవకాశముందని సుదర్శన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీరాంసాగర్‌తో పాటు ఇతర జలాశయాల్లో నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో విద్యుత్ ఉత్పత్తిపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దీంతో వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలోనూ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు.ఈ పరిస్థితుల్లో రైతులు యాసంగిలో వరి సాగు చేయకుండా కూరగాయలు, పప్పుదినుసులు వంటి తక్కువ నీటి అవసరమున్న పంటల వైపు మళ్లేలా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. జలాశయాల్లో మిగిలి ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తూ తాగునీటి అవసరాలకు సరిపడా నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ధాన్యం విక్రయాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ సలహాదారు సూచించారు. ప్రస్తుత ఖరీఫ్‌లో వరి దిగుబడులు ఆశించిన స్థాయిలో వస్తుండటంతో పాటు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తున్న నేపథ్యంలో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రైవేట్ వ్యాపారులు, దళారుల

మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు.

గతంలో ధాన్యం కొనుగోలు చేసిన కొందరు వ్యాపారులు రైతులకు నగదు చెల్లించకుండా మోసగించిన ఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. అందువల్ల ధాన్యం విక్రయించిన వెంటనే నగదు చెల్లింపులు చేసే వారికే పంటను విక్రయించాలని, చెల్లింపుల విషయంలో స్పష్టత లేకుండా లావాదేవీలు జరపవద్దని హితవు పలికారు.

నీటి వృథాపై గట్టి నిఘా

జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఏ ప్రాంతంలోనైనా నీటి ఎద్దడి ఏర్పడితే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన మరమ్మతులు, ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.అవసరమైన ప్రాంతాల్లో తాగునీటి కోసం వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితులు మినహా కొత్త బోర్ల తవ్వకాలకు వెళ్లవద్దని తెలిపారు. తాగునీటి పైపులైన్లలో లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టాలని, వార్డుల వారీగా పనిచేస్తున్న బోర్లతో పాటు నిరుపయోగంగా ఉన్న బోర్లను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించాలని, నీటి వృథాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చూడాలన్నారు. నీటి పొదుపుపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

సమీక్షలో పాల్గొన్న ప్రముఖులు

ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్నతో పాటు మున్సిపల్, మిషన్ భగీరథ, ప్రజారోగ్య, గ్రామీణ నీటి సరఫరా, భూగర్భ జలాలు, వ్యవసాయ, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి తెలంగాణలో మోస్తరు

వర్షాలు వాతావరణ శాఖ

హైదరాబాద్ : తెలంగాణలోని పలు ప్రాంతాల్లో రేపు, ఎల్లుండి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. ఉత్తర తమిళనాడు,దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు మధ్య కొనసాగుతోందని వివరించారు .
దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ మరియు పరిసర ప్రాంతాలలో ఉన్న సదరు ఉపరితల ఆవర్తనం నుంచి వాయవ్య బంగాళాఖాతం వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు ద్రోణి విస్తరించి ఉందని తెలిపారు. శనివారం ఉదయం 5 గంటలకు సమయానికి బలహీన పడిందని పేర్కొన్నారు. రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన ఉరుములు, గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాల కులు తెలిపారు.

PRGI No: TGBIL/25/A0946
విశాలజ్యోతి
సమగ్ర తెలుగు దినపత్రిక

భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు

● పాల్గొన్న బీరంగూడ డివిజన్ బిజెపి అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్

పటాన్చెరు, విశాలజ్యోతి: పటాన్‌చెరు నియోజకవర్గం, అమీన్పూర్ మండల పరిధిలో నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బీరంగూడ డివిజన్ బిజెపి అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ వివిధ ప్రాంతాలలో ఏర్పాటుచేసిన దుర్గామాత మండపాలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కిష్టారెడ్డిపేట్ గ్రామంలో దొంతు పెంటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ, పటేల్ గూడ గ్రామంలో రొయ్యల వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలలో అలాగే వివిధ కాలనీలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ఉత్సవ నిర్వాహకులు, భక్తులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈర్లరాజు ముదిరాజ్ మాట్లాడుతూ, నవరాత్రి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలు మాత్రమే కాకుండా, హిందూ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి భావం, సామాజిక ఐక్యతను చాటిచెప్పే పవిత్రమైన పండుగలని,సనాతన ధర్మ పరిరక్షణ మనందరి బాధ్యత అని అన్నారు మన సంస్కృతిని మనమే కాపాడుకోవాలి. మన సంప్రదాయాలను భావితరాలకు అందించాలి. ధర్మాన్ని ఆచరిస్తూ, సేవాభావంతో సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు.దుర్గామాత ఆరాధన స్త్రీశక్తికి, ధర్మానికి, ధైర్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి ఉత్సవాలు యువతలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య సోదరభావం, ఐక్యతను బలోపేతం చేస్తాయని తెలిపారు.

అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని చాటిచెబుతాయని, భక్తితో పాటు సేవా దృక్పథం కూడా ప్రతి ఒక్కరిలో ఉండాలని అన్నారు. పండుగలు కులమతాలకు అతీతంగా ప్రజలందరినీ కలిపే వేదికలుగా నిలవాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపతో అమీన్పూర్ మండలంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, పరస్పర గౌరవంతో పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ ఉపాధ్యక్షులు నిమ్మల శ్రీధర్ రెడ్డి, బీజేపీ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల రాకేష్ గుప్తా, ఈర్ల భాస్కర్ ముదిరాజ్, రొయ్యల రాజు ముదిరాజ్, కమ్మరి భాస్కర్ చారి, భైరవ్, నాగరాజ్, శ్రీనివాస్, కల్వకుంట్ల రాకేష్ గుప్తా, విష్ణువర్ధన్ రెడ్డి, మహేష్, దేవేం దర్, రఘు తదితరులు పాల్గొన్నారు

దసరా కు ఊరు వెళ్తున్నారా జాగ్రత....

● బండమీది వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు చేవెళ్ల నియోజకవర్గం

చేవెళ్ల అక్టోబర్ 17 విశాల జ్యోతి న్యూస్ ప్రతినిధి శ్రీ పాల్: దసరా పండుగకు ఊరికి వెళ్తున్న వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని బండమీది వెంకటేష్ తెలిపారు. వెంకటేష్ ఆయన మాట్లాడారు.దసరా సెలవులకు వెళ్లే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మండల ప్రజలను అప్రమత్తం చేశారు. దసరా సెలవులు పురస్కరించుకొని తమ స్వగ్రామాలు, విహార యాత్రలకు తరలి వెళ్తుండటంతో, ఇండ్లల్లో చోరీలను నియంత్రణ చేసేందుకు పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుంది. అలాగే చోరీల కట్టడికై ప్రజలు సైతం తమ వంతు బాధ్యత. పోలీసులు తెలిపిన ఈ క్రింది సూచనలను పాటించాల్సిందిగా ఆయన కోరారు. సెలవుల్లో బయటకు వెళ్ళినప్పుడు మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం ఉండే తాళం, సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్ను ఏర్పాటు చేసుకోవడం మంచిది.తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి స్థానిక పోలీస్టేషన్ లో లేదా మీ గ్రామ పోలీస్ అధికారికి సమాచారం ఇవ్వండి. వారి వివరాలు నమోదు చేసుకొని వారి ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలే తప్ప, పక్కింటి వారికి తెలిసిన వారికి ఇచ్చి మోసపోవద్దు. మీ వాహనాలు ఇంటి ఆవరణలోనే పార్క్ చేసుకోండి. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్ తో లాక్ వెయ్యడం మంచిది. సోషల్ మీడియాలో మీ లొకేషన్, ట్రావెల్స్ ప్లాన్స్, ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం అనే మీ అప్డేట్స్ పెట్టకండి. మీ ఇంట్లో స్వీయ రక్షణ సీసీ కెమెరాలను అమర్చుకోవాలి.

మదన్‌పల్లిలో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు

● ఆటపాటలు, నృత్యాలతో సందడి చేసిన మహిళలు.. గ్రామంలో పండుగ వాతావరణం

మక్లూర్, అక్టోబర్ 17: నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలం మదన్‌పల్లి గ్రామంలో బతుకమ్మ పండుగ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను అలంకరించి, ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. మహిళల కోలాహలం మధ్య గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో

పాల్గొన్నారు. సంప్రదాయ పాటలు పాడుతూ, బతుకమ్మల చుట్టూ ఆడిపాడుతూ పండుగ సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు. మహిళల ఆటపాటలు, సందడితో మదన్‌పల్లి గ్రామం పండుగ శోభను సంతరించుకుంది.

యాంటీ బయోటిక్స్‌కు లొంగని బ్యాక్టీరియాను సైతం

నాశనం చేసే వైరస్ సైంటిస్టుల పరిశోధన

యాంటీబయాటిక్ మందులకు లొంగని బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లకు మరింత సమర్థవంతమైన చికిత్సలను అభివృద్ధి చేసేందుకు శాస్త్రవేత్తలు కీలకమైన కొత్త విషయాన్ని కనుగొన్నారు. బ్యాక్టీరియాపై దాడి చేసే వైరస్‌లు తమలోని రక్షణ వ్యవస్థను ఎలా అప్రమత్తం చేస్తున్నాయో తాజా పరిశోధన వెల్లడించింది. బ్యాక్టీరియాను ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకుని నాశనం చేసే బ్యాక్టీరియోఫేజ్ వైరస్‌లను ఉపయోగించే చికిత్సా విధానాన్ని ఫేజ్ థెరపీ అంటారు. ఈ విధానం ద్వారా హానికరమైన బ్యాక్టీరియాను నాశనం చేయవచ్చు. అయితే, వైరస్‌ల దాడిని ఎదుర్కొనేందుకు బ్యాక్టీరియాకు కూడా సొంత రోగనిరోధక వ్యవస్థలు ఉండడంతో చికిత్సలో సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ రక్షణ వ్యవస్థల పనితీరును అర్థం చేసుకోవడం ద్వారా మెరుగైన చికిత్సలను రూపొందించవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

బ్యాక్టీరియాలో ఉండే కీలక వ్యవస్థ..

ఈ అధ్యయనం బ్యాక్టీరియాలోని సీబీఏఎస్‌ఎస్ (జదీూూూ) అనే రోగనిరోధక వ్యవస్థపై దృష్టి సారించింది. వైరస్ దాడి జరిగినప్పుడు ఈ వ్యవస్థ అప్రమత్తమై, అవసరమైతే సోకిన బ్యాక్టీరియా కణం తనను తాను నాశనం చేసుకునేలా చేస్తుంది. దీనివల్ల వైరస్ ఇతర సమీప కణాలకు వ్యాపించే అవకాశాన్ని అడ్డుకోవచ్చు. అయితే, ఈ ప్రక్రియలో బ్యాక్టీరియా కణమే నశిస్తుంది కాబట్టి నిజమైన వైరస్ ముప్పును గుర్తించినప్పుడే ఈ వ్యవస్థ పనిచేయడం అత్యంత కీలకం. వైరస్ ఉత్పత్తి చేసే ప్రోటీజ్ అనే ఎంజైమ్ బ్యాక్టీరియా కణంలోని ఒక ముఖ్యమైన గుర్తింపు ప్రోటీన్‌ను విచ్ఛిన్నం చేస్తుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ మార్పే హెచ్చరిక సంకేతంగా పని చేసి, రోగనిరోధక ప్రతిస్పందనను ప్రారంభిస్తుంది.

బ్యాక్టీరియాలోని ప్రోటీన్‌పై ప్రభావం..

ఇప్పటివరకు తెలిసిన కొన్ని రోగనిరోధక వ్యవస్థలు వైరస్ జన్యు పదార్థాన్ని నేరుగా గుర్తించి స్పందిస్తాయి. కానీ సీబీఏఎస్‌ఎస్ వ్యవస్థలో మాత్రం వైరస్ ఉత్పత్తి చేసిన ఎంజైమ్ బ్యాక్టీరియాలోని ప్రోటీన్‌పై చూపే ప్రభావమే రక్షణ చర్యను ప్రారంభించే సంకేతంగా పనిచేస్తుంది. వైరస్ తనకు అవసరమైన ప్రక్రియలో భాగంగా ఉత్పత్తి చేసే ఎంజైమ్‌నే బ్యాక్టీరియా తన రక్షణ వ్యవస్థను అప్రమత్తం చేసేందుకు ఉపయోగించుకోవడం ఈ పరిశోధనలో గుర్తించిన ప్రధాన అంశం. ఈ విధానం గురించి తెలుసుకోవడం వల్ల బ్యాక్టీరియా వైరస్‌లను ఎలా గుర్తిస్తుంది, వాటి దాడిని ఎలా ఎదుర్కొంటుంది అనే విషయాలపై మరింత స్పష్టత లభిస్తుంది. ఈ పరిశోధన ఫలితాలు సైన్స్ అనే శాస్త్రీయ పత్రికలో ప్రచురితమయ్యాయి.

ఫేజ్ థెరపీకి మార్గం సులభతరం..

ఈ ఆవిష్కరణ యాంటీబయాటిక్ నిరోధక బ్యాక్టీరియాపై ఫేజ్ థెరపీని మరింత ప్రభావవంతంగా అభివృద్ధి చేసేందుకు ఉపయోగపడే అవకాశం ఉంది. బ్యాక్టీరియా రక్షణ వ్యవస్థలను అధిగమించగల వైరస్‌లను రూపొందించడానికి పరిశోధకులకు ఇది మార్గనిర్దేశం చేస్తుంది. అలాగే సీబీఏఎస్‌ఎస్ వ్యవస్థకు మనుషుల్లో కనిపించే కొన్ని రోగనిరోధక ప్రక్రియలతో సంబంధం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు.

బ్యాక్టీరియా, మానవుల్లోని ఈ వ్యవస్థల మధ్య ఉన్న పోలికలు, వైరస్‌లను ఎదుర్కొనే కొన్ని ప్రాథమిక రక్షణ విధానాలు కోట్లాది సంవత్సరాల పరిణామ క్రమంలోనూ కొనసాగి ఉంటాయని సూచిస్తున్నాయి. బ్యాక్టీరియాపై వేగంగా ప్రయోగాలు చేసి తెలుసు కున్న విషయాలను మరింత సంక్లిష్టమైన జీవ వ్యవస్థల్లో పరిశీలించేందుకు కూడా ఈ పరిశోధన తోడ్పడుతుందని పరిశోధకులు తెలియజేస్తున్నారు.

ఏఐపై అతిగా ఆధార పడుతున్న యువత.. మానసిక

ఆరోగ్యం దెబ్బ తింటుందని నిపుణుల హెచ్చరిక..

కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో, దానిపై అతిగా ఆధారపడడం యువత మానసిక ఆరోగ్యానికి కొత్త సవాలుగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రచనలు చేయడం, సందేహాలకు సమాధానాలు తెలుసుకోవడం, వ్యక్తిగత సమస్యలపై సలహాలు తీసుకోవడం, భావోద్వేగ పరమైన తోడ్పాటు పొందడం వంటి అవసరాల కోసం చాలామంది ఏఐ చాట్‌బాట్‌లను ఆశ్రయిస్తున్నారు. గతంలో ఆహారం, సంస్కృతి, కథనాలపై ఆసక్తిగా రచనలు చేసిన ఓ యువ రచయిత.. ఇప్పుడు ఏఐ సహాయం లేకుండా రాయలేకపోతున్నానని చెప్పడం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. అయితే, ఏఐని తరచూ ఉపయోగించడం మాత్రమే వ్యసనంగా భావించకూడదు. దాని సహాయం లేకుండా పని చేయలేకపోవడం, నిర్ణయాలు తీసుకోలేకపోవడం లేదా భావోద్వేగాలను నియంత్రించలేకపోవడం వంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆందోళన చెందాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఏఐ చాట్‌బాట్‌ల పట్ల ఆకర్షణ..

యువతకు చిన్నప్పటి నుంచే డిజిటల్ సంభాషణలు, ఆన్‌లైన్ సమాచార వినియోగం అలవాటుగా మారడంతో ఏఐ చాట్‌బాట్‌లకు త్వరగా ఆకర్షితులవుతున్నారని నిపుణులు వివరిస్తున్నారు. తక్షణమే సమాధానాలు అందించడం, వ్యక్తిగతంగా స్పందిస్తున్నట్లు అనిపించడం వల్ల వాటిపై నమ్మకం పెరుగుతోంది. గణిత సమస్యలకు సరైన సమాధానాలు ఇచ్చే ఏఐ, వ్యక్తిగత సంబంధాలు, భావోద్వేగ సమస్యలపైనా సరైన సలహా ఇస్తుందని కొందరు భావిస్తున్నారు. కానీ ఒక సమాధానం స్పష్టంగా, నమ్మకంగా కనిపించినంత మాత్రాన అది సరైనదని చెప్పలేం. పదేపదే ఏఐ నుంచే ధైర్యం, ఆమోదం, సాంగత్యం కోరుకోవడం.. మనుషులతో మాట్లాడడం కంటే చాట్‌బాట్‌తో సంభాషించడమే సులభంగా అనిపించడం భావోద్వేగ పరమైన ఆధారపడడానికి సంకేతాలు అవుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఒంటరితనం, సామాజిక భయం ఎదుర్కొంటున్నవారికి ఇది తాత్కాలిక ఉపశమనం కలిగించినా, నిజ జీవిత సంబంధాల్లో ఎదురయ్యే భిన్నాభిప్రాయాలు, నిరాశ, అనిశ్చితిని ఎదుర్కొనే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశాలు తగ్గుతాయి.

సృజనాత్మకతపై ప్రభావం..

ఏఐపై అధికంగా ఆధారపడడం సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, స్వతంత్ర నిర్ణయ సామర్థ్యంపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రచనలకు ఆలోచనలు రూపొందించడం, సమాచారాన్ని క్రమబద్ధీకరించడం, వాదనల్లో లోపాలను గుర్తించడం వంటి పనుల్లో ఏఐ సహాయకరంగా ఉంటుంది. అయితే, ఏఐ ఇచ్చిన సమాధానాలను ప్రశ్నించకుండా స్వీకరిస్తూ, స్వయంగా ఆలోచించడం, విశ్లేషించడం, కొత్త ఆలోచనలు అభివృద్ధి చేసుకోవడం వంటి ప్రక్రియలను పక్కనపెడితే నేర్చుకునే అవకాశాలు తగ్గుతాయి. నిద్ర, ఉద్యోగం, చదువు లేదా కుటుంబ బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తూ గంటల తరబడి చాట్‌బాట్‌లతో గడపడం, స్నేహితులు, కుటుంబ సభ్యులకు దూరమవడం, ఏఐ అందుబాటులో లేనప్పుడు ఆందోళన చెందడం, సాధారణ నిర్ణయాలకూ దాని ఆమోదం కోరుకోవడం వంటి లక్షణాలను గమనించాలని సూచిస్తున్నారు. అయితే, ఏఐ వినియోగం వల్ల మెదడు పనితీరు లేదా సృజనాత్మకత తప్పనిసరిగా దెబ్బతింటాయని నిర్ధారించే ఆధారాలు ఇంకా సరిపోవు. దాని దీర్ఘకాలిక ప్రభావాలపై మరింత పరిశోధన అవసరమని స్పష్టం చేస్తున్నారు.

అవగాహన పెంచడం అవసరం..

భారత్‌లో యువత సంఖ్య అధికంగా ఉండడం, మానసిక ఆరోగ్య నిపుణుల సేవలు అందరికీ సులభంగా అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో ఈ అంశంపై అవగాహన పెంచడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

మీకు ఫ్యాటీ లివర్ సమస్య ఉందా

అయితే ఈ పండ్లు తప్పక తినాలి

ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య ఈమధ్య కాలంలో పెరుగుతున్నది. చాలామందిలో ఈ సమస్య ఉన్నా స్వల్ప లక్షణాలతో గుర్తించలేకపోతారు. అయితే గుర్తించేసరికి సమస్య ముదిరి కాలేయం దెబ్బతినడం మొదలవుతుంది. అధిక కొవ్వులు ఉండే ఆహారం , జంక్ ఫుడ్ ఆల్కాహాల్ అలవాటు వంటివి ఫ్యాటీ లివర్ సమస్యకు దారితీస్తాయి. శరీరానికి వ్యాయామం లేకపోవడం కూడా ఈ సమస్యను పెంచుతుంది. అయితే కొన్ని రకాల పండ్ల (ఖీతీబఱ్‌ం) ను తరచూ తీసుకోవడం ద్వారా ఫ్యాటీ లివర్ సమస్యను నియంత్రించవచ్చని నిపుణులు చెబుతున్నారు.



అవకాడోలు

వీటిలో ఆరోగ్యకరమైన ఒమెగా--3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. దాంతోపాటు మన కాలేయం సమర్థవంతంగా పనిచేసేందుకు, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించేందుకు తోడ్పడే రసాయన సమ్మేళనాలు కూడా వీటిలో ఎక్కువ. ఇవి కాలేయ కణాలు దెబ్బతినకుండా కాపాడుతాయని నిపుణులు చెబుతున్నారు.

పొప్పడిపండ్లువీటిలో అద్భుతమైన జీర్ణ సంబంధిత ఎంజైములు ఉంటాయి. ఈ ఎంజైములు జీర్ణశక్తిని పెంచడంతోపాటు కాలేయాన్ని రక్షిస్తాయని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో విష పదార్థాలను తొలగించడంలో, పోషకాలను శరీరం బాగా సంగ్రహించడంలో పొప్పడి పండు బాగా పనిచేస్తుందని అంటున్నారు.

దానిమ్మ

దానిమ్మలో పాలిఫెనాల్స్‌గా పిలిచే రసాయన సమ్మేళనాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి కాలేయం దెబ్బతినకుండా కాపాడుతాయి. కాలేయం చుట్టూ కొవ్వు చేరకుండా అడ్డుకుంటాయి. మొత్తం శరీర ఆరోగ్యానికి కూడా బాగా తోడ్పడుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

నారింజ, బత్తాయి, నిమ్మ

నిమ్మజాతి పండ్లలో విటమిన్ సి ఎక్కువ. విటమిన్ సి శరీరంలో విష పదార్థాలను బయటికి పంపడంలో కాలేయానికి తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుందని, దీనివల్ల కాలేయం సమర్థంగా పనిచేస్తుందని అంటున్నారు.

పుచ్చపండుపుచ్చపండ్లలోనూ యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. కాలేయం నుంచి విష పదార్థాలను బయటికి పంపించి, సమర్థవంతంగా పనిచేసే ందుకు ఇవి తోడ్పడతాయి. ఇవి శరీరంలో నీటి శాతం తగిన స్థాయిలో ఉండేలా చూస్తా యని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

బెర్రీలు

బెర్రీ జాతి పండ్లలో విభిన్నమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. అదే సమయంలో కాలేయం సమర్థవంతంగా విష పదార్థాలను వడగట్టేందుకు తోడ్పడతాయి.

యాపిల్స్

వీటిలో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. ఇవి కాలేయం పనితీరును మెరుగు పరుస్తాయి. దాని చుట్టూ కొవ్వు చేరకుండా నియంత్రిస్తాయి. ఫ్యాటీ లివర్ సమస్యను అరికడతాయని నిపుణులు వివరిస్తున్నారు.

గమనిక

పండ్లు ఏవైనా సరే ఆరోగ్యానికి మంచివే అయినా షుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్నవారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అందువల్ల వైద్యుల సలహా తీసుకోవడం మంచిదని అంటున్నారు.

"VISHALA JYOOTHI" vide PRGI Registration No. "TGBIL/25/A0946" Printed by Published by DEVENDAR KUNTA on behalf of DEVENDAR KUNTA, printed atHAMARA WARANGAL PRINTERS AND GRAPHICS, H.NO: 25-8-182,BABUJI NAGAR, KAZIPET, WARANGAL, TELANGANA - 506003. and published at H.NO. 4-123/1,KUNTA WADA,RAIPARTHY, WARANGAL, TELANGANA - 506314. Editor DEVENDAR KUNTA, Cell : 9440711117.